ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.38 | సహర్ : 4.40 (శుక్రవారం)

సూర్యాపేట

5

గురువారం 4 ఏప్రిల్ 2024



చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.161	233	266

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 కనిష్ఠం 24.4



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రశ్నించే గొంతును ఎంపీగా గెలిపించాలి

తెలంగాణ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతును గెలిపించాలని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో తొలి హామీ మహిళలకు రూ.2500 అమలు చేయలేదని విమర్శించారు. రూ.2లక్షల రుణమాఫీ, ధాన్యానికి రూ.500బోనస్, రూ.4వేల పింఛన్, రూ.15వేల రైతుబంధు, తులం బంగారం, రూ.4వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5లక్షల బ్యాంకు కార్డు...వీటిలో ఏ హామీ కూడా అమలు కాలేదన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, తెలంగాణ ఉన్నంతకాలం, భూమి ఉన్నంతకాలం గులాబీ జెండా ఉంటుందన్నారు.

- ఆంధ్రజ్యోతి-యాదాద్రి

7

ఆరు గ్యారెంటీలు అమలవుతాయా ?

వంద అబద్ధాలు, ఆరు గ్యారెంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తోందని తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి, బెల్గాం ఎమ్మెల్యే అభయ్ పాటిల్, బీజేపీ శాసనసభ ఫ్లోర్‌లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం విజయ సంకల్ప మహా సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. నల్లగొండతోపాటు దేశంలో నాలుగు వందల సీట్లు గెలిచి కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.

- నల్లగొండ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్

ఉమ్మడి జిల్లాకు కొత్త రైల్వేలైన్

- దోర్నకల్-గద్వాల లైన్‌కు మార్గం సుగమం
- త్వరలో పట్టాలెక్కనున్న ప్రాజెక్టు
- సూర్యాపేట, నల్లగొండ జిల్లాల మీదుగా..
- పల్లెలు, తండాల్లో వినబడనున్న రైలు కూత



నల్లగొండ, ఏప్రిల్ 3 : ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా కొత్త రైల్వేలైన్‌కు మార్గం సుగమమైంది. డోర్నకల్ నుంచి గద్వాల వరకు కొత్త రైల్వే ప్రాజెక్టు పట్టాలు ఎక్కనుంది. సూర్యాపేట, నల్లగొండ జిల్లా ప్రజలకు, రైలు ప్రయాణికులకు సౌత్ సెంట్రల్ రైల్వే(ఎస్‌సీఆర్) శుభ వార్త చెప్పడంతో ప్రతీ ఒక్కరిలో ఉత్సాహం నెలకొంది. త్వరలోనే ఈ రైల్వే నిర్మాణం చేపడితే ఈ రెండు జిల్లాల్లోని పల్లెలు, తండాల్లో రైలు కూతలు వినపడనుంది. సౌత్ సెంట్రల్ రైల్వే గత ఏడాది ఈ ప్రతిపాదనలకు అంగీకరించడంతో డోర్నకల్ - గద్వాల రైలు మార్గానికి సంబంధించి సర్వేతో పాటు ఇతర పనులు చకాచకా జరుగుతున్నాయి. రైలు మార్గం నిర్మాణానికి అవసరమైన తుది సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించి మోతె మండలంలో సర్వే మార్కింగ్ చేపట్టారు. నూతన రైల్వేమార్గం సర్వే పనులు డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం మీదుగా మోతె మండలం కొత్తగూడెం ప్రాంతంలో జరిగాయి. ఇప్పటికే తుది స్థాన సర్వే(ఫైనల్ లోకేషన్)లో భాగంగా మండలంలోని కొత్తగూడెం, తుమ్మలపల్లి తదితర గ్రామాల వద్ద రహదారి పాసింగ్‌లను సైతం గుర్తించిన సర్వే బృందం మార్కింగ్ కూడా చేసింది. ఈ రైలుమార్గానికి ఎఫ్ఎల్ఎస్ సర్వే కోసం గత సంవత్సరం ఎస్‌సీఆర్ రూ.7.40కోట్లను మంజూరు చేసింది. సుమారు 296 కిలోమీటర్ల పొడవున్న ఈ రైలుమార్గం నిర్మాణానికి రూ.5,330కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. దక్షిణ తెలంగాణలోని కూసుమంచి, పాలేరు, మోతె, సూర్యాపేట, బీమారం, తిప్పర్తి, నల్లగొండ, కనగల్, చండూరు, నాంపల్లి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, బూత్‌పూర్ వంటి ప్రధాన ప్రాంతాలను కలుపుతూ ఈ రైలు మార్గం సాగనుంది.

ప్రయాణికులకు పెరగనున్న సేవలు

సికింద్రాబాద్ - విజయవాడ రైల్వేలైన్ ప్రాంతంలో ఈ కొత్తమార్గం సుగమం కావడంతో రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు, త్వరితగతిన ప్రయాణం చేసే అవకాశాలు దక్కనున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, సికింద్రాబాద్, విజయవాడ రైలుమార్గాలను అనుసంధానం చేసేలా పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం సికింద్రాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగుళూరు మధ్య రైలు మార్గాలున్నాయి. ఈ రెండింటినీ అనుసంధానం చేసే రైలు మార్గం అవసరాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే గుర్తించింది. ఇప్పటివరకు రైలు మార్గం లేని ప్రాంతాల మీదుగా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించి డోర్నకల్ -గద్వాల రైలు ప్రాజెక్టు తీసుకురావాలని నిర్ణయం తీసుకుని అందుకు అనుగుణంగా ఫైనల్ లోకేషన్ సర్వేను చేపట్టింది. డోర్నకల్ - గద్వాల్ లైన్‌తో ఉమ్మడి జిల్లాలైన వరంగల్, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ వాసులకు ఈ మార్గం ఎంతగానో ఉపయోగపడనుంది. కొత్త రైల్వేమార్గం పనులను ముందుగా మహబుబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి ప్రారంభించి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం మీదుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మోతె మండలంలోని కొత్తగూడెం వరకు చేపడుతారు. డోర్నకల్ - గద్వాల లైన్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల వాసులు డోర్నకల్ నుంచి మొదలుకుని నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన ప్రయాణికులు గద్వాల వరకు ప్రయాణించే వీలుంటుంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు లేదా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కొత్త రైల్వేలైన్ పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులకు బెంగుళూరు వెళ్లడానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.

- యాసంగి సాగులో అడుగడుగునా ఇక్కట్లే
- ధాన్యం విక్రయానికీ నానా తంటాలు పడుతున్న రైతులు
- సన్నధాన్యం విక్రయాల్లో నైరాశ్యం
- ఆలస్యంగా రంగంలోకి ప్రభుత్వరంగ సంస్థలు
- కేంద్రాలు ప్రారంభమైనా ఊపందుకోని కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లాలో 1.40లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనాలని లక్ష్యం
- చివరి ధాన్యపు గింజవరకు కొంటామంటోన్న యంత్రాంగం



నల్లగొండ జిల్లాకేంద్రం పరిధిలోని అర్జాలబావిలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

విక్రయానికీ ప్రయాసే

ఎండనక, వాననక ఆరుగాలం శ్రమించి పంటను పండిస్తే.. ప్రకృతి వైపరీత్యాల ప్రతాపాన్ని తట్టుకొని.. పంటకోసి.. కుప్పనూర్చి.. మార్కెట్‌కు తెస్తే విక్రయిద్దామంటే అందుబాటు ధరలేక, దళారుల దందాతో రైతుల శ్రమకు ఫలితం లేకుండా పోతోంది. సీజన్ ఆరంభంలో తేమశాతంతో సంబంధం లేకుండానే క్వింటాకు రూ.2800వరకు చెల్లించిన మిల్లర్లు, ధాన్యం రాక పెరిగాక ఉన్నట్లుండి మెలిక పెడుతూ సన్నధాన్యం ధర తగ్గించేశారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

యాసంగి సాగులో అడుగడుగునా అన్నదాతలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పంట సీజన్‌లో నీరందక ఇబ్బందులు పడితే, ఇప్పుడు ధాన్యం విక్రయానికి కళ్లు కాయలు కాసేలా నిరీక్షిస్తున్నారు. వరికోతలు ముగిసి, ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లు ఊపందుకున్నా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మాత్రం ఇంకా వేగం పుంజుకోలేదు. కొనుగోళ్ల లక్ష్యం నిర్దేశించడం మొదలుకొని, కేంద్రాల ఏర్పాటు వరకు మందకొడిగా కార్యాచరణ సాగుతుంటే, ఎండలు మండిపోతుండడంతో కేంద్రాల వద్దకు ధాన్యం తెచ్చి కాంటాలకోసం ఎదురుచూస్తున్న రైతులు అవస్థలు పడుతున్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఇప్పుడిప్పుడే కొనుగోలు కేంద్రాలు మొదలైతే, యాదాద్రి భువనగిరి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

ఆలస్యంగా రంగంలోకి ప్రభుత్వరంగ సంస్థలు

యాసంగిలో ధాన్యం కొనుగోళ్లను ప్రతి యేటా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించి నిర్వహిస్తోంది. ఇక్కడ గ్రేడ్ వన్ ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2203, సాధారణ రకానికి క్వింటాకు రూ.2183 ధర లభిస్తుండడంతో రైతులు యాసంగి ధాన్యం ఈ కేంద్రాల వద్ద విక్రయించడానికే మొగ్గు చూపుతున్నారు. మార్చి రెండోవారం నుంచి జరిగే ఈ కేంద్రాల ప్రారంభం ఈ యేడాది ఏప్రిల్ వచ్చినా పూర్తిస్థాయిలో మొదలు కాలేదు. దీర్ఘకాలిక రకాలు, దొడ్డురకాలనే ఈ కేంద్రాలకు రైతులు విక్రయిస్తుండడం, వీటికోతలు ఇప్పుడిప్పుడే పూర్తవుతుండడంతో కేంద్రాల ఏర్పాటు జాప్యమయిందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో యాసంగిలో 10.41లక్షల ఎకరాల్లో వరిసాగైతే, 18.61 మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 11.40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 974 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే యాదాద్రి జిల్లాలో ఇప్పటివరకు 80 కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. రైతులు ధాన్యాన్ని కళ్లాల వద్ద ఆరబెట్టుకుంటున్నారు. నల్లగొండ జిల్లాలో 200 కేంద్రాలు ప్రారంభించినా ఇప్పటివరకు కేవలం 1,398 మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోళ్లు చేశారు. మరోవైపు సూర్యాపేట జిల్లాలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ 253 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా 2,565 మెట్రిక్‌టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారు. మరోవారంలో కొనుగోళ్లు ఊపందుకుంటాయని భావిస్తున్న అధికార యంత్రాంగం, మే రెండోవారం వరకు ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతాయని అంచనావేస్తోంది. కొనుగోళ్లలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తున్నామని, చెల్లింపుల విషయంలోనూ ఎలాంటి లోటుపాట్లు రాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేస్తున్నామని, రైతుల వద్ద ఉన్న చివరి ధాన్యపు గింజ వరకూ కొనుగోలు చేశామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని కలెక్టర్లు, సివిల్‌సప్లయిస్ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లా	వరిసాగు(లక్షలఎకరాల్లో)	అంచనా(మెట్రిక్‌టన్నులు)	కొనుగోలులక్ష్యం (మె.ట)	ప్రతిపాదితకేంద్రాలు	ప్రారంభమైనవి	కొన్నధాన్యం(టన్నులు)
నల్లగొండ	4.20	10.00	5.00	370	200	1398
సూర్యాపేట	3.81	3.61	2.40	281	253	2565
యాదాద్రి	2.40	5.00	4.00	323	80	------
మొత్తం	10.41	18.61	111.40	974	533	3963

రైతులకు నిరాశ

జిల్లాలో ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యం విక్రయాల్లో రైతులకు నిరాశే మిగిలింది. గిట్టుబాటు ధర వస్తుందనే నమ్మకంతో సన్నరకాలు సాగుచేస్తే, ఆశించిన ధర దక్కలేదు. ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, మూసీ ఆయకట్టులో స్వల్పకాలిక రకాలైన సన్నరకం ధాన్యం సాగయింది. దీంతో ఈ సన్న ధాన్యమంతటినీ మిర్యాలగూడ కేంద్రంగా విస్తరించిన ఆధునిక రైసుమిల్లులకే విక్రయించారు. గతేడాది, అంతకుముందు సీజన్లలో కూడా ఈ ధాన్యానికి క్వింటాకు రూ.2800 నుంచి రూ.3000 వరకు ధర చెల్లించడంతో రైతులు ఈసారి కూడా ధర వస్తుందనే నమ్మకంతో సాగుచేశారు. సీజన్ ఆరంభంలో తేమశాతంతో సంబంధం లేకుండానే క్వింటాకు రూ.2800 వరకు చెల్లించిన మిల్లర్లు, ధాన్యం రాక పెరిగాక ఉన్నట్లుండి తాలు వస్తుందని, తెల్ల బెండ్లు వస్తున్నాయని పేర్కొంటూ ధర తగ్గించేశారు. మద్దతు ధరకంటే కొంత ఎక్కువైనప్పటికీ, ఆశించిన ధర మాత్రం ఇవ్వలేదు. క్వింటాకు రూ.2300 నుంచి రూ.2600లోపే సన్నరకం ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం వస్తుందని అంచనావేయగా, ఇప్పటివరకు సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం విక్రయించగా, మిగిలిన ధాన్యం ఇంకా విక్రయానికి రావాల్సి ఉంది.



ఎడమకాల్వపై 150 మందితో పహారా



పెన్‌పహాడ్ మండలం అన్నారంబ్రిడ్జి వద్ద ఎడమకాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

పెన్‌పహాడ్/ నేరేడుచర్ల, ఏప్రిల్ 3 : పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్న దృష్ట్యా మధ్యలో రైతులు అడ్డుతగల కుండా సాగర్ ఎడమ కాల్వ వెంట వివిధ శాఖలకు చెందిన 150 మంది సిబ్బందితో పహారా ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ వెంకటరావు తెలిపారు. బుధవారం ఎడమకాల్వకు నీటి సరఫరా జరగడంతో పెన్‌పహాడ్ మండలం అన్నారంబ్రిడ్జి, నేరేడుచర్ల మండలం దాచారం వద్ద కాల్వను అదనపు ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. జిల్లాలోని 26 బృందాలు కాల్వ వెంట రాత్రీ, పగలు పహారా కాస్తాయన్నారు. సాగర్ ఎడమ కాల్వ నుంచి పాలేరుకు సజావుగా వెళ్లకుండా మధ్యలో తూముల నుంచి కానీ, వ్యవసాయ మోటార్ల ద్వారా నీటిని బయటకు తీయకూడదని ఆయన రైతులకు సూచించారు. కాల్వపై ఉన్న విద్యుత్ మోటార్లకు కనెక్షన్లను తొలగించాలని విద్యుత్ అధికారులను ఆదేశించామన్నారు. అనంతరం సాగర్ ఎడమ కాల్వపై 76 కిలోమీటర్ల నుంచి 82వ కిలోమీటర్ వరకు కాల్వపై ఉన్న తూములను, కాల్వను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ అమరేందర్‌రెడ్డి, హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్లు మహేందర్‌రెడ్డి, సైదులు, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ పెరిక రవీందర్, డీటీ ధరవాత్ లాల్, ఎస్ఎస్‌పీ వర్క్ ఇన్‌స్పెక్టర్ కోల పాపయ్యగౌడ్, ఎస్ఎస్‌పీ ఏఈఈలు శృతి, నవకాంత్, పాండునాయక్ ఉన్నారు.

సీజ్ చేసిన వాటికి రశీదు ఇవ్వాలి

సూర్యాపేట(కలెక్టరేట్): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో సీజ్ చేసిన వాటికి వెంటనే రశీదు ఇవ్వాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లత, అదనపు ఎస్పీ నాగేశ్వరరావుతో కలసి పాల్గొన్నారు. బాధితులు ఇబ్బందులు పడకుండా రశీదులు చూపితే తిరిగి వారి సామాగ్రిని అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.3.53 కోట్ల నగదుతో పాటు వివిధ రకాల సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశామని కలెక్టర్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లతతో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసి, మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ పూర్తి చేశామన్నారు.

రైతుల కోసం కంట్రోల్ రూం

జిల్లాలో పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, రైతులకు సందేహాలు, సలహాల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్‌రూం నెంబర్ 6281492368కు సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదు: మంత్రి ఉత్తమ్

- పార్లమెంట్ ఎన్నికల్లో వారికి వచ్చే సీట్లు సున్నా
- కరువు మొదలైంది బీఆర్ఎస్ పాలనలోనే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 3 : పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదని, బీఆర్ఎస్‌కు వచ్చే సీట్లు సున్నా అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశభవిష్యత్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికలు కీలకం కానున్నాయన్నారు. కేంద్రంలో 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రశ్నించే గొంతుకను నొక్కేసేలా ఈడీ, సీబీఐలను వాడుకుంటుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యం నిలబడుతుందన్నారు. నిరుద్యోగులకు నోటిఫికేషన్లు వేయకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగించాడని తెలిపారు. రాష్ట్రానికి బీఆర్ఎస్ చేసిందేమీ లేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు మనుగడలేదన్నారు. కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే అబద్ధపు ప్రచారాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కరువు పేరుతో మాజీ సీఎం కేసీఆర్ రాజకీయ ప్రచారం చేసుకుంటున్నారని, అసలు కరువు ప్రారంభమైందే బీఆర్ఎస్ పాలనలో అని తమ ప్రభుత్వంలో అది కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీఏఏ, ఎన్ఆర్‌సీని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఫోన్‌ట్యాపింగ్‌తో నాయకులు, సినిమా నటులు ఎంతో మంది ఇబ్బంది పడ్డారని ప్రజలకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో తాగు, కరెంట్ సరఫరా, సాగునీరుపై మాజీ మంత్రి కేటీఆర్ చేస్తున్న ప్రకటనలు అర్థరహితమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని, ఏచిన్న అవినీతి లేకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ఏఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. గతంలో రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో నీరు నిండుగా ఉంటే ప్రస్తుతం తక్కువగా నీరు ఉందని, నీటిని పొదుపుగా వాడుకుంటున్నామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 13 నుంచి 14 వరకు స్థానాలు గెలుచుకుంటుందని, దేశంలోనే అత్యధిక మెజార్టీతో ఈ నెల 6వ తేదీన తుక్కుగూడలో జరిగే పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునాఖర్గే, ఏఐసీసీ సభ్యుడు రాహుల్‌గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. దేశభవిష్యత్‌ను మార్చేలా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేసిందన్నారు. సభకు నల్లగొండ పార్లమెంట్ పరిధి నుంచి సుమారు 50 వేల మంది హాజరవడం జరుగుతందని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్‌అలీ, భైరు శైలేందర్‌గౌడ్, కక్కిరేణి శ్రీనివాస్, వీరన్ననాయక్, గండూరి రమేష్, చింతమల్ల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి మార్కెట్ నిండా ధాన్యం

- బుధవారం 32వేల బస్తాలు రాక
- రెండు రోజులు సెలవులు ప్రకటించిన అధికారులు



తిరుమలగిరి, ఏప్రిల్ 3 : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌ను ధాన్యం ముంచెత్తింది. రైతులు భారీగా ధాన్యాన్ని తీసుకువచ్చారు. ఈ సీజన్ ప్రారంభంలో రెండు రోజుల కిందట 20 వేల బస్తాల ధాన్యం రాగా, బుధవారం అత్యధికంగా 32860 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. 507 మంది రైతులు 32,860 బస్తాల్లో 21,029 క్వింటాళ్ల ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించారు. వీటిలో ఆర్ఎన్ఆర్‌లు 1,245 బస్తాల్లో 796 క్వింటాళ్ల ధాన్యానికి గరిష్ఠ ధర రూ.2,220, కనిష్ఠ ధర రూ.1,939, ఎస్ఎం రకం 125 బస్తాల్లో 80 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా రూ.2,329, కనిష్ఠంగా రూ.1,959, ఐఆర్-64 రకం 31,490 బస్తాల్లో 20,153 క్వింటాళ్లు రాగా గరిష్ఠ ధర రూ.2,000, కనిష్ఠంగా రూ.1,650ల ధర పలికాయి. ధాన్యం ఎగుమతుల దృష్ట్యా వ్యాపారుల కోరిక మేరకు గురువారం, జగజ్జీవన్‌రావు జయంతి సందర్భంగా శుక్రవారం మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

నేడు ఫణిగిరి క్షేత్రానికి హెరిటేజ్ డైరెక్టర్ రాక

నాగారం, ఏప్రిల్ 3 : మండలంలోని ప్రసిద్ధ ఫణిగిరి బౌద్ధక్షేత్రానికి బుధవారం తెలంగాణ హెరిటేజ్ డైరెక్టర్ భారతి హోళికేరి, హెరిటేజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ వస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ మల్లునాయక్ తెలిపారు. ఫణిగిరిగుట్టపై మార్చి నెలలో తెలంగాణ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మూడోసారి గుట్టపై తవ్వకాలు ప్రారంభించారు. మార్చి 29న క్రీస్తు శకం 2000 వేల ఏళ్ల నాటి ఇక్ష్వాకుల పరిపాలన కాలంలో వాడుకలో ఉన్న సీసపు నాణేలు, బౌద్ధ ఆధారాలు లభ్యమయ్యాయి. తవ్వకాల్లో లభ్యమైన నాణేలు, వస్తువుల పూర్తి వివరాల సమాచారం తెలియపర్చడానికి హెరిటేజ్ డైరెక్టర్ వస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా గతంలో జరిపిన తవ్వకాల్లో లభ్యమైన వస్తువులను ప్రస్తుతం స్థానిక మ్యూజియంలో ప్రదర్శనలో ఉంచారు.

మేళ్లచెర్వులో కన్నుల పండువగా రథోత్సవం

మేళ్లచెర్వు, ఏప్రిల్ 3 : మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. అనంతరం అహోబిల రామానుజ స్వామి వారి ఆధ్వర్యంలో చక్రస్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు కుటుంబసభ్యులు, సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న మైహోం సంస్థల చైర్మన్ రామేశ్వరరావు

ఇప్పటివరకు ఏ హామీ అమలుకాలేదు

● పదేళ్లలో బీజేపీ దేశ ప్రజలకు చేసిందేమీలేదు ● భూమి ఉన్నంత కాలం గులాబీ జెండా ఉంటుంది ● మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు

యాదాద్రి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క హామీ అమలు కాలేదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు జరగాలంటే ప్రశ్నించే గొంతును గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అధిష్ఠానం సామాజిక దృక్పథంతో బలహీనవర్గాలకు చెందిన క్యామ మల్లేష్‌ను ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేసిందన్నారు. ఆరు గ్యారంటీల్లో తొలి హామీ మహిళలకు రూ.2500 అమలు చేయలేదన్నారు. రూ.2లక్షల రుణమాఫీ, ధాన్యానికి రూ.500ల బోనస్, రూ.4వేల పింఛన్, రూ.15వేల రైతుబంధు, తులం బంగారం, రూ.4వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5లక్షల బ్యాంకుకార్డు వీటిలో ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదన్నారు. నిరుద్యోగులకు రూ.4వేలు ఇస్తామని, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ భువనగిరిలో సభలోనే హామీ ఇచ్చారని, అలాంటి హామీనే ఇవ్వలేదని అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి చెప్పారని విమర్శించారు. కేసీఆర్ మాటంటే మాటేనని మొదటి సారి అధికారంలోకి రాగానే రూ.200పింఛన్‌ను రూ.వెయ్యి చేశారని, మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. వెయ్యి పింఛన్‌ను రూ.2వేలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ మెడలు వంచాలన్నారు. కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేసి పార్టీ నుంచి బహిష్కరించబడిన వ్యక్తి అని, అతని తో జాగ్రత్తగా ఉండాలన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని, గ్యాస్, పెట్రోల్, ధరలను భారీగా పెంచిందన్నారు. మోదీ నల్లధనం తేలేదని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలివ్వలేదని విమర్శించారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేయడంకాదని, ప్రజలకు చేసిన మేలేంటో బీజేపీ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, భూమి ఉన్నంతకాలం గులాబీ జెండా ఉంటుందని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డి, పక్కన హరీ‌ష్‌రావు

కష్టపడదాం.. ఎంపీ అభ్యర్థిని గెలిపించుకుందాం

కష్టపడి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకుందామని మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని, 11 దఫాలుగా రైతుబంధు జమ చేశామని తెలిపారు. రైతులకు ఉచితంగా 24గంటల విద్యుత్‌తోపాటు రెండు పంటలకు సమృద్ధిగా నీరందిందన్నారు. భువనగిరి ఎంపీగా గెలిపిస్తే తాను నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి జరిగిందన్నారు. భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్‌గాంధీ సంతకాన్ని ఫోర్జరీచేసిన వ్యక్తి అని, ఆ పార్టీ నాయకులు అతని అభ్యర్థిత్వాన్ని ఎలా బలపరుస్తారని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, అమరేందర్ పాల్గొన్నారు.

వాళ్లకే వారంటీ లేదు.. గ్యారెంటీలు అమలవుతాయా?

● హామీలు నెరవేర్చకుండా ఏ మొహంతో ఓట్లు అడుగుతారు ● బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నల్లగొండ, కనగల్, ఏప్రిల్ 3: వంద అబద్ధాలు.. ఆరు గ్యారెంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ముందుకొస్తోందని బీజేపీ శాసనసభపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి, బెల్గాం శాసనసభ్యుడు అభయ్ పాటిల్ అన్నారు. నల్లగొండ పట్టణంలో బుధవారం బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్ అధ్యక్షతన బూత్ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్లతో విజయసంకల్ప మహా సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండతో పాటు దేశంలో 400సీట్లు గెలిచి కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాలో మూడు కుటుంబాలు రాజ్యం ఏలుతున్నాయని, వారి కుటుంబ రాజకీయాలను కూకటి వేళ్లతో పెకిలిస్తామన్నారు. ఉద్యమాలకు పురిటి గడ్డగా పేరు గాంచిన నల్లగొండ నుంచే మార్పు మొదలు కావాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండు పథకాలు మాత్రమే అమలు చేసి మొత్తం అమలు చేసినట్లుగా పత్రికల్లో గొప్పలు చెప్పుకుంటూ ప్రజలను మరోసారి మభ్యపెడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు, కోకాపేట భూముల అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేసిన ఆయన, ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన కమీషన్ల కారణంతోనే మౌనంగా ఉన్నారని ఆరోపించారు. 13 వారాల్లో రూ.13వేల కోట్ల అప్పు చేసి, కనీసం జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తారని వారు ప్రశ్నించారు. ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వారసత్వ రాజకీయాలను సమాధి చేయాల్సిన అవసరముందన్నారు. దేశంలో గెలిచే 400 సీట్లలో నల్లగొండ కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తాను బీజేపీలో చేరడం పూర్వ జన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు బొబ్బ భాగ్యరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెళ్లి చంద్రశేఖర్, నూకల నర్సింహ్మారెడ్డి, కంకణాల శ్రీధర్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, కంకణాల నివేదితారెడ్డి, కేలావత్ లాలూనాయక్, సాధినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ శాసన సభపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి కనగల్ మండలంలోని చెర్లగౌరారంలో వరి పొలాన్ని పరిశీలించారు.



నల్లగొండలో మాట్లాడుతున్న బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి

బీజేపీతోనే దేశాభివృద్ధి : బూర

మునుగోడు: కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా మునుగోడులో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ప్రతిపక్షాలు చేసే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. భువనగిరి ప్రాంతంలో తన హయాంలోనే అభివృద్ధి దిశగా అడుగులు పడ్డాయన్నారు. అన్నిరంగాలుగా అభివృద్ధి కోసం ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా నియామకమైన మండలంలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన పులకరం సైదులుముదిరాజ్‌ను సన్మానించారు.

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల

సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 3: ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సూర్యనారాయణరెడ్డి కోరారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని, విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని సూర్యనారాయణరెడ్డి తెలిపారు.



సీఎంను కలిసిన సూర్యనారాయణరెడ్డి

గ్రానైట్ అక్రమ తరలింపుపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు

గుర్రంపోడు, ఏప్రిల్ 3: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని వట్టికూడు గ్రామంలోని ఏదులబండ నుంచి ధ్వజస్తంభాలకు వాడే గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు బుధవారం విచారణ నిర్వహించారు. గ్రామంలోని ఏదులబండకు వెళ్లి అక్కడ జరుగుతున్న అక్రమ గ్రానైట్‌ను పరిశీలించారు. మాజీ గ్రామ సర్పంచ్ కేసాని యాదగిరిరెడ్డి, గ్రామ కార్యదర్శి నక్క స్వామిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కత్తి వెంకట్‌రెడ్డితో పాటు మరికొందరు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపనున్నట్లు రామ్మోహన్‌రావు తెలిపారు.

పదవి పోయాక కేసీఆర్‌కు కరువు గుర్తొచ్చిందా?

దేవరకొండ, ఏప్రిల్ 3 : 'మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పదవి పోయాక నల్లగొండ జిల్లాలో కరువు గుర్తుకు వచ్చిందా.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదు' అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్, తాగునీటి సమస్యలపై కేసీఆర్, కేటీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని, వారి మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ దిగజారుడు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులను పూర్తిచేస్తే దేవరకొండ ప్రాంతంలో ఇప్పుడు తాగునీటి సమస్య ఉండేదికాదన్నారు. అందుకు కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 14 స్థానాలు గెలుచుకుంటుందని, నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీరారెడ్డి 5లక్షలకుపైగా మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో అధికారుల స్వేచ్ఛను హరించారన్నారు. రైతుల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకాన్ని అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల సహకారంతో ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందిస్తామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడిలేకుండా అన్ని చర్యలు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, పున్న వెంకటేశ్వర్లు, శ్రీశైలంయాదవ్, లక్ష్మీలచ్చిరాంనాయక్, హరికృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

పంట నష్టపరిహారం చెల్లించాలి : జూలకంటి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 3: పంటలు ఎండిన రైతులకు ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం లేదని, కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ యాసంగి నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.500ల బోనస్ ఇవ్వాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు కూడా చెల్లించాలన్నారు. కొన్నిచోట్ల మిల్లర్లు తగిన మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదన్నారు. వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వరితో పాటు పండ్ల తోటలు కూడా ఎండిపోతున్నాయని చెప్పారు. రెవిన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సంబంధిత అధికారులతో టీంలు ఏర్పాటు చేసి ఎండిపోయిన పండ్ల తోటలను అంచనా వేసి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, సీహెచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నాటకరంగాన్ని ప్రోత్సహించాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 3: ప్రజల్లో మానవతా విలువలు, ఆధ్యాత్మికచింతన, జీవనశైలి తదితర అంశాలపై అనాదిగా అవగాహన కల్పిస్తూ ప్రజాదారణ పొందుతున్న నాటకరంగాన్ని ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలని అష్టావధాని కాటేపల్లి లక్ష్మీనర్సింహమూర్తి, రంగస్థల సీనియర్ నటుడు గుంటి పిచ్చయ్య అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని మినీరవీంద్రభారతిలో జరుగుతున్న పద్య, పౌరాణిక సాంఘిక నాటకాలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర భాషాసాంస్కృతికశాఖ, జాతీయస్థాయి నాటక పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. నాటక రంగంపై పెంచుకున్న మక్కువతో కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వర్తమాన పరిస్థితుల్లో రంగస్థలం నాటకాలను ప్రజలు ఆదరించడం కళాకారులకు సంతృప్తినిస్తుందన్నారు. ప్రేక్షకుల ఆదారాభిమానాలు దక్కినప్పుడే కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు పోటీపడి తాము ఎంచుకున్న పాత్రలో నటించి జీవిస్తారని అన్నారు. కాగా బుధవారం శ్రీస్వామిఅయ్యప్ప, మాధవవర్మ పద్యనాటకాలు, శిథిల జీవితం సాంఘిక నాటకాలు ఆకట్టుకున్నాయి. నాటక ప్రదర్శనలు గురువారం చివరిదశకు చేరుతాయని నాటకమండలి కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ తెలిపారు.

ఎంతో వ్యయప్రయాసాలతో కూడిన నాటకోత్సవాలను నిర్వహించేందుకు దాతలు అందించిన చేయూత అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, చంద్రశేఖర్‌రావు, జానకిరామశర్మ, ఇనాయతుల్లా, శ్రీనివాసశర్మ, ఉపేందర్, జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీస్వామి అయ్యప్ప పద్యనాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

బీజేపీకి మిర్యాలగూడ నియోజకవర్గ కన్వీనర్ రాజీనామా

మిర్యాలగూడ, ఏప్రిల్ 3: బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ కన్వీనర్ బాణావత్ రతన్ సింగ్‌నాయక్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి వాట్సప్ ద్వారా రాజీనామా లేఖ పంపినట్లు తెలిపారు. పార్టీలో కొందరి ఆధిపత్య ధోరణి, పని తీరు నచ్చకనే పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓడిపోతామని పార్టీ అభ్యర్థి ముందే అస్త్ర సన్యాసం చేయడం బాధాకరమన్నారు. పార్టీ సమకూర్చిన వనరులను కూడా పూర్తిగా వినియోగించుకోక పోవడం, పార్టీ కార్యకర్తల మనోభావాలకు విలువ ఇవ్వకపోవడంతో ఆశించిన ఓట్లు పార్టీకి పడలేదని పేర్కొన్నారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నాయకుడు, నియోజకవర్గ ప్రభారి మరి కొందరు నేతలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తనను నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్టీ పదవికి రాజీనామా చేసి సాధారణ కార్యకర్తగా ఉంటానని తెలిపారు.



రతన్‌సింగ్‌నాయక్

దేవాలయాలే లక్ష్యంగా దొంగతనాలు

● ఘరానా దొంగ అరెస్టు ● పలు దేవాలయాల్లో బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 3: గతంలో దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కి, జైలుకు వెళ్లాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. తిరిగి ప్రసిద్ధ దేవాలయాలను టార్గెట్ రాత్రి సమయంలో దొంగతనాలు చేసేవాడు. నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలో కొద్ది రోజులుగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడితో పాటు అతడి నుంచి సొత్తు కొనుగోలు చేసిన మరో వ్యక్తిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.50లక్షల విలువ చేసే 3.462 కేజీల వెండి, నాలుగు గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.41వేల నగదు, బైక్, ఇనుపరాడ్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ చందనాదీప్తి వివరాలు వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ ప్రాంతానికి చెందిన ఖమ్మంపాటి బుచ్చయ్య స్థానిక ఐకాన్ ఆస్పత్రిలో వాచ్‌మన్‌గా పనిచేస్తుండేవాడు. అతనిపై గతంలో 2015 నల్లగొండ టూటౌన్, రూరల్ పోలీ‌స్‌స్టేషన్ల పరిధిలో ఎనిమిది దొంగతనాల కేసులు నమోదు కావడంతో అప్పట్లో జైలుకు వెళ్లాడు. 2018 నవంబరులో జైలు బయటకు వచ్చాడు. కొన్నాళ్లు మంచిగానే ఉన్నాడు. తర్వాత తనలోని నేర ప్రవృత్తిని తిరిగి ప్రారంభించాడు. ప్రసిద్ధ దేవాలయాలను టార్గెట్ చేసుకొని దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. అందులో భాగంగా చండూరు మండలంలోని సంతాన సుబ్రమణ్య స్వామి దేవాలయం, ఉడుతలపల్లి గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయం, తెరాట్‌పల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీగాంధే చేన్నకేశ్వర స్వామి గుడి, మునుగోడులో కనకదుర్గమ్మ గుడి, నల్లగొండ టౌన్‌లో గంధ వారిగూడెంలో గల కనక దుర్గమ్మ గుడి, కతాల్‌గూడలోని ఆంజనేయ స్వామిదేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఆయా దేవాలయాల్లో మొత్తం 3.462 కేజీల వెండి ఆభరణాలు, నాలుగు గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించాడు. దొంగిలించిన ఆభరణాల్లో కొన్నింటిని గొల్లగూడ ప్రాంతానికి చెందిని స్వర్ణకారుడు కూరెళ్ల సత్యనారాయణకు విక్రయించాడు. మరికొన్నింటిని ఇంట్లోనే దాచిపెట్టాడు. బుధవారం చండూరు ఎస్ఐ తన సిబ్బందితో కస్తాల ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అటు వస్తున్న బుచ్చయ్యను అనుమానంతో ఆపారు. అతని వద్ద స్వామివారి ఆభరణాలు లభించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దొంగలించిన ఆభరణాలను కొనుగోలు చేసిన సత్యనారాయణను అదుపులోకి తీసుకోవడంతో పాటు అతని వద్ద ఉన్న ఆభరణాలతో పాటు బుచ్చయ్య ఇంట్లో ఆభరణాలను, రూ.41 వేల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభకనబర్చిన డీఎస్పీ కె. శివరాంరెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, సీసీఎస్ సీఐ మహాలక్ష్మయ్య, ఎస్ఐ సురేష్, ఐటీకోర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

నాగార్జునసాగర్, కట్టంగూరు, ఏప్రిల్ 3: వేర్వేరు కారణాలతో నల్లగొండ జిల్లాలో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీకి చెందిన బొల్లెపల్లి హరీ‌ష్‌రాజ్(23) శనివారం తెల్లవారు జామున ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన ఇరుగు పొరుగు వారు అతనిని స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషయమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. హరీ‌ష్‌రాజ్ తండ్రి కూడా ఐదు సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఉంటోంది. హరీ‌ష్‌రాజ్ ఒక్కడే సాగర్‌లో ఉంటాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగార్జునసాగర్ ఎస్ఐ సంపత్ తెలిపారు.



హరీ‌ష్‌రాజు (ఫైల్)

పని చేయాలని తల్లి మందలించిందని..


కట్టంగూరు మండలంలోని కురమర్తి గ్రామానికి చెందిన గుండెగోని హరిబాబు(27) కొంతకాలంగా తాగుడుకు బానిసై ఏమి పనీ చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో ఏదైనా పని చేసుకుని బతకాలని అతని తల్లి లక్ష్మమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన హరిబాబు 2వ తేదీన రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మండంలోని చెరువు అన్నారం గ్రామ శివారులోని పొలాల్లో ఉన్న స్థూపానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు మృతదేహాన్ని చూసి బంధువులకు సమాచారం ఇచ్చారు. హరిబాబు తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ అఫ్జల్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

హత్య కేసులో మహిళ అరెస్ట్

భువనగిరి రూరల్, ఏప్రిల్ 3: హత్య కేసులో ఓ మహిళను బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ తరలించారు. భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 19వ తేదీన మండలంలోని వనపర్తి గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్య అతని భార్య వీరమణి, కుమారులు బాల మల్లేష్, గోపి కృష్ణలు కర్రలు, కొడవలితో దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన పద్మారెడ్డి చికిత్స పొందుతూ మార్చి 31న మృతిచెందాడు. దాడికి పాల్పడిన తండ్రి సత్తయ్య, కుమారుడు బాల మల్లేష్, గోపి కృష్ణలను ఈ నెల 26న అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేయగా ప్రస్తుతం 4వ ముద్దాయి అయిన వీరమణి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 3: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం శాఖాజీపురం గ్రామానికి చెందిన శిరబోయిన లచ్చయ్య(65) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న లచ్చయ్య మంగళవారం ఆయుర్వేద మాత్రల కోసం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా దర్శికి వెళ్లాడు. తిరిగి అదే రోజు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో ఆర్టీసి బస్సు డ్రైవర్ కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని ఓ దాబా వద్ద భోజనం కోసం బస్సు ఆపాడు. ఈ క్రమంలో మూత్ర విసర్జన కోసం బస్సు దిగిన లచ్చయ్య రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి బొగ్గు లోడుతో జడ్చర్లకు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో లచ్చయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. లచ్చయ్యకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.



శిరబోయిన లచ్చయ్య(ఫైల్)

దండెంపై దుస్తులు ఆరేయబోయి..

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 3: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని నేనావత్‌తండలో మంగళవారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. నేనావత్‌తండాకు చెందిన నేనావత్ రవీందర్(24) సాయంత్రం స్నానం చేసి తన దుస్తులను ఇంటి ఎదుట ఉన్న దండెం పైన ఆరవేస్తుండగా ఆ తీగకు విద్యుత్ సరఫరా అయి విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రవీందర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

బ్యాగ్ లాక్కెళ్లిన దొంగకు దేహశుద్ధి

చౌటుప్పల్ రూరల్ ఏప్రిల్ 3: మహిళ నుంచి హ్యాండ్ బ్యాగ్‌ను లాక్కెళ్లిన దొంగను స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో బుధవారం జరిగింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన బిట్టు చౌటుప్పల్ పట్టణ కేంద్రం బంగారిగడ్డ ప్రభుత్వాసుపత్రికి వెళ్తున్న మహిళ నుంచి హ్యాండ్ బ్యాగును లాక్కెళ్లడానికి ప్రయత్నించాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు దొంగను అడ్డగించి పట్టుకున్నారు. అతనికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సకాలంలో ధాన్యం కాంటాలు వేయాలి

డీఆర్‌డీఏ పీడీ మధుసూదనరాజు

సూర్యాపేట రూరల్, తుంగతుర్తి, అర్వపల్లి, చివ్వెంల, నాగారం, ఏప్రిల్ 3: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యం కాంటాలు వేయాలని డీఆర్‌డీఏ పీడీ మధుసూదనరాజు ఆదేశించారు. బుధవారం మండలంలోని ఇమాంపేటలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు తీసుకువచ్చి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా నిర్వాహకులు అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రణపంగ వెంకయ్య, సీసీ సైదులు, రైతులు పాల్గొన్నారు.

● ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఏపీఎం పాడి శెట్టి నరసయ్య అన్నారు. తుంగతుర్తి మండలంలోని గుడితండ, సంగెం, అన్నారం, కొత్తగూడెం, దేవునిగుట్టతండా, మంచ్యతండా, బండరామారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీసీలు గడ్డం గిరి, నర్సింగ్‌నాయక్, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

● అర్వపల్లి మండలంలోని పర్సాయిపల్లి, కాసర్లపహాడ్, సూర్యానాయక్ తండా, తిమ్మాపురం, కుంచమర్తి, ఉయ్యాలవాడ, వేల్పుచెర్ల గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఎం మల్లేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో శశిధర్‌రెడ్డి, ఏఈఓలు శోభ, సత్యం, అవి లయ్య, నూర్జహాన్, వెంకన్న, సుజాత, మల్లేష్, విజయ పాల్గొన్నారు.

● చివ్వెంల మండలంలోని రోళ్లబండతండా గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం రాంబాబుతో కలసి తహసీల్దార్ కృష్ణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మీనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

● నాగారం మండలంలోని వర్ధమానుకోట, ఫణిగిరి, మామిడిపల్లి, పసునూరు గ్రామాల్లో ఐకేపీ-సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొను గోలు కేంద్రాలను సంఘబంధం నిర్వాహకులు ప్రారంభించారు. కార్యక్ర మంలో సంఘ బంధం నిర్వాహకులు తెల్సూరి మమత, బొబ్బలి శోభ, రెడ్డిమల్ల ఏలేంద్ర, అందె మాధవి, మమత, వీబీకేలు పూలమ్మ, పడకంటి శోభరాణి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట మండలం ఇమాంపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మధుసూదనరాజు

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 3: ప్రసిద్ధ మట్టపల్లి పుణ్యక్షేత్రంలో బుధ వారం లక్ష్మీనృసిం హుని నిత్య కల్యా ణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల యంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వాచనం, రక్షాబం ధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనం తరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం స్వామివారికి మహానివేదన పెట్టి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచా ర్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగా చార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి: డీపీవో

చివ్వెంల, ఏప్రిల్ 3: ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని డీపీవో జి.సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పను లను పరిశీలించి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. చెత్తచెదారాన్ని కాల్వల్లో, పరిసరాల్లో వేయొద్దని అన్నారు. గామపంచాయతీ కార్మికులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.కార్యక్రమంలో ఎంపీవో గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యంతోనే విజయం సాధ్యం

నేరేడుచర్ల, ఏప్రిల్ 3: లక్ష్యంతోనే విజయం సాధ్యమవుతుందని నేరేడుచర్ల అంజలి స్కూల్ ప్రిన్సిపాల్ అలుక సైదిరెడ్డి అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి రమావత్ మధుసూదన్ 15ఉద్యోగాలు సాధించిన సందర్భంగా బుధవారం పాఠశాలలో ఆయ నను సన్మానించి మాట్లాడారు. పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధించవచ్చని మధుసూదన్ నిరూపించారన్నారు. విద్యార్థులు మధుసూదన్‌ను ఆదర్శంగా తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, జానకిరాములు, నాగప్ర సాద్, యాకూబ్, ఆదినారాయణ, రాము, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, ప్రసాద్, నాగేంద్ర బాబు, నాగలక్ష్మి, సత్య, సుజాత, అనిత, వీణ, కవిత, స్వప్న, నర్మద, మాధవి, సంతుశ్రీ, సైదాబీ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

'మహనీయుల జయంతిని విజయవంతం చేయాలి'

కోదాడ టౌన్, ఏప్రిల్ 3: ఈ నెలలో జన్మించిన మహనీయుల జయంతి కార్యక్ర మాలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ డి.ధనుం జయనాయుడు కోరారు. బుధవారం కోదాడలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనై జింగ్ సెక్రటరీ ఇనుగుర్తి వెంకటరమణాచారి, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలక రాజు శ్రీను ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఈ నెల ఐదో తేదీన భారతరత్న, భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని, 11న బీసీల జాతిపిత మహాత్మ జ్యోతిరావుపూలే జయంతిని, 14న రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బీఆర్ అంబేద్కర్ జయంతిని జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో నిర్వహించాలని ఆయన కోరారు.

'ఉపాధి' పని రోజులను పెంచాలి: ఎంపీడీవో

మఠంపల్లి, ఏప్రిల్ 3: మండలంలో గత ఏడాది కంటే ఈ ఏడాది 'ఉపాధి' పని రోజులను పెంచి ప్రతీ 'ఉపాధి' కూలికి పనికల్పించాలని ఎంపీడీవో మామిడి జాన కిరాములు అన్నారు. బుధవారం ఉపాధిహామీ కార్యాలయంలో 'ఉపాధి' పనుల పురో గతిపై ఎస్ఎంఎంఎస్ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఉపాధి సిబ్బందితో నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పనికి ముందు, పనిజరిగే సమ యంలో, పని పూర్తయిన తర్వాత ఫొటోలను ఎంబీ రికార్డు చేయాలన్నారు. సమా వేశంలో ఏపీవో ఉమ, ఈసీ సందీప్, టీఏలు నరసింహ, సక్కునాయక్ పాల్గొన్నారు.

నిర్బంధంగా నీటి తరలింపు సరికాదు: వ్య.కా.స.

మునగాల రూరల్, ఏప్రిల్ 3: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటిని పోలీ సులను, అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి పాలేరుకు నిర్బంధంగా తరలిం చడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకా.స.) జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ ములకలపల్లి రాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సాగునీరు, తాగునీరు కోసం రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో సాగర్ ఎడమ కాల్వ ద్వారా వదిలిన నీటిలో కొంతమేర హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గ ప్రాంతాలకు అధి కారులు పంపి సమన్యాయం పాటించాలన్నారు. పాలేరుకు నీటి తరలింపులో ఎన్ఎ స్పీ అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సోమపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, రాపోలు సూర్యనారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లబారిన పడకుండా అవగహన కల్పించాలి

తుంగతుర్తి, ఏప్రిల్ 3: సైబర్ నేరగాళ్లబారిన పడకుండా విద్యార్థులు తమ తల్లి దండ్రులు, బంధువులకు అవగాహన కల్పించాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివా సరావు అన్నారు. 'సైబర్ జాగరూకత దివస్' కార్యక్రమంలో భాగంగా జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్, తుంగతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రం లోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసా లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ హాజరై మాట్లాడుతూ ప్రజలు అత్యాశతో సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని అన్నారు. ఎవరైనా సైబర్ మోసాల బారినపడితే వెంటనే 1930కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, తుంగతుర్తి ఎస్ఐ ఏడుకొం డలు, సైబర్ క్రైమ్ సిబ్బంది సైదులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను కొంతమేర పరిష్కరించాం

అనంతగిరి, ఏప్రిల్ 3: మండలంలోని శాంతినగర్ గ్రామంలో నీటి సమస్యను కొంతమేర పరిష్కరించామని జడ్పీ సీఈవో అప్పారావు తెలిపారు. బుధవారం శాంతినగర్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో బోర్లు ఎండిపోవడంతో గ్రామం మొత్తానికి నీరు అందనందున, వాటర్ ట్యాంకుల ద్వారా కొన్ని నెలలుగా నీరు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నూతనంగా రెండు బోర్లు వేసి, వాటికి మోటార్లు అమర్చి నీటిని పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్, రవికుమార్, ఎంపీవో నాగేశ్వరరావు, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ అభినందనీయం

మద్దిరాల, ఏప్రిల్ 3: ఎండ నుండి రక్షణ కోసం మండల కేంద్రంలోని చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీటీసీ మార్త అనిత అన్నారు. బుధవారం మద్దిరాలలో లయన్స్ క్లబ్ సౌజన్యంతో చిరు వ్యాపా రులకు గొడుగులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు షేక్ నాగు ల్‌మీరా, బందు కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, సుధీఆర్‌రెడ్డి, యాకూబ్‌అలీ పాల్గొన్నారు.

'కిరణ్‌కుమార్‌రెడ్డి విజయానికి కృషిచేయాలి'

నూతన్‌కల్, ఏప్రిల్ 3: భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి విజయానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేశాలని ఆ పార్టీ నాయకుడు ఎలిమినేటి కృష్ణప్రశాంత్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు నారాయణ, వెంకన్న, మల్లయ్య, శ్రీను, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తా



హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీయూడబ్ల్యూజే-ఐజేయూ ప్రతినిధులు

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 3: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుచేయిస్తానని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని జర్నలిస్టులు కలిసి, ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా ఉంటుందన్నారు. ముఖ్యంగా కోదాడలో ఇళ్ల స్థలాల మంజూరుకు ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉన్నాయో పరిశీలించి, నివేదిక అందజేయా లని ఆర్డీవోను ఆదేశించారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలా లపై నిర్లక్ష్యం చేసి పక్షపాత వైఖరి అవలంబించిందని మంత్రికి జర్నలిస్టులు వివరించారు. అనంతరం టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు కుమార్తె ఉదయభాను, ఉపేంద్ర దంపతులను మంత్రి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కోల నాగేశ్వర రావు, ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు అప్పిరెడ్డి, దాడుల నిరోధ కమిటీ అధ్యక్షుడు బాదె రాము, సీనియర్ జర్నలిస్టులు నరేందర్, హరినాథ్, మల్లికార్జున్‌రావు, దశరథరెడ్డి, వెంకటేశ్వర్లు, రాంబాబు, వీరభద్రం, వాసు, దామోదర్, సతీష్, రమేష్, అజయ్, షంషుద్దీన్, రాము, నాగ రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

పెన్‌పహాడ్, కోదాడ టౌన్, ఏప్రిల్ 3: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండలం లోని దోసపహాడ్ గ్రామంలో పోలీసులు, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతు అనంతరం ప్రజలతో ఆయన మాట్లాడారు. రాజకీయ కక్షలను విడనాడాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు ఆశపడకుండా ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అల్లరి మూకలపై నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పెరక రవీం దర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని కోదాడ పట్టణ సీఐ రాము కోరారు. బుధవారం కోదాడలోని పోలీస్‌స్టేషన్ నుంచి రంగా థియేటర్, సూర్యాపేట రోడ్డు వరకు కేంద్ర బలగాలు, సీఐఎస్ఎఫ్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించాయి. అనంతరం రంగా థియేటర్ ఆవరణలో సీఐ మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై పోలీసులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లం ఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్‌గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్‌లో ప్రజలతో మాట్లాడుతున్న రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి



సూర్యాపేట మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, నూతనకల్, మద్దిరాల, ఏప్రిల్ 3: వేసవి కాలం వచ్చినందున మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడీ భిక్షం సూచించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ముందుగా వివిధ శాఖల అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి పనుల నివేదికను చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు. ఎండాకాలం దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు చని పోకుండా చూడాలన్నారు. సర్వసభ్య సమావేశంలో గ్రామ సర్పంచ్‌లు లేనందున సమావేశం సాదాసీదాగా జరిగింది. అనంతరం కార్యాలయ ఆవరణలో ఉన్న మొక్కలకు అధికారులు, ప్రజాప్రతినిధులు నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, వైస్ ఎంపీపీ శ్రీని వాస్‌నాయుడు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

● ఎండల తీవ్రత పెరుగుతున్నందున అధికారులు గ్రామాల్లో పర్యటించి మంచినీటి ఎద్దడి రాకుండా చూడాలని మద్దిరాల వైస్ ఎంపీపీ బెజ్జెంకి శ్రీరాంరెడ్డి కోరారు. బుధవారం మద్దిరాల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావే శంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అధికారులను నూతనకల్ ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి కోరారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అత్యవసరమైతేనే బయటికి రావాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమ మల్లారెడ్డి, ఎంపీడీవో సునీత, ఏపీఎం కరు ణాకర్, ఏఈ లావణ్య పాల్గొన్నారు.



నూతనకల్‌లో మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భూరెడ్డి కళావతి

'ఉపాధి' కూలీలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



పానుగోడులో 'ఉపాధి' కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ బండ కవిత

గరిడేపల్లి, ఏప్రిల్ 3: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదె బ్బకు గురికాకుండా 'ఉపాధి' కూలీలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తహసీల్దార్ బండ కవిత సూచించారు. బుధవారం మండలంలోని పానుగోడు, గారకుంటతండా గ్రామాల్లో జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో 'ఉపాధి' కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఉపాధి' కూలీలు మంచినీరు ఎక్కువగా తాగాలని, పనులు చేసే ప్రదేశంలో టెంట్, మంచినీటి వసతి ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, ఎంపీవో మౌలానా, ఏపీవో సురేష్, కార్యదర్శి సైదులు, జనమైత్రి ఫౌండేషన్ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగయ్య, వెంకటరెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

గరిడేపల్లి, ఏప్రిల్ 3: మండలంలోని సర్వారం గ్రామంలో శ్రీసీతారా మచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ పూజలు వైభవంగా కొనసాగుతు న్నాయి. బుధవారం నాలుగో రోజు బలిహరణం, సుదర్శన హోమం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవమూర్తులకు పంచామృతా లతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువ కులు కర్రలతో కాపలా కాస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం జ్యోతిర్లింగార్చన, వివిధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పురో హితులు రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాజశేఖర్‌శర్మ, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, యువకులు



సుదర్శనహోమం నిర్వహిస్తున్న అర్చకులు

క్రైం పాయింట్

Crime point

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి



సోమయ్య మృతదేహం

చివ్వెంల, ఏప్రిల్ 3: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుడకుడ ప్రాంతానికి చెందిన గీత కార్మికుడు బూర సోమయ్య(44)బుధవారం గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తూ ప్రమా దవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సోమయ్యను స్థానికులు గుర్తించి, 108అంబులెన్సులో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తుం డగా, మార్గ మధ్యలోనే మృతి చెందాడు. సోమయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.పెద్ద కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగల దుకాణంలో చోరీ

తిరుమలగిరి, ఏప్రిల్ 3: తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని నగల దుకాణంలో పట్టపగలే చోరీ జరిగింది. దుకాణం యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరిలోని శాంభవి బంగారు నగల దుకాణా నికి మంగళవారం సాయంత్రం ఇద్దరు మహిళలు వచ్చారు. దుకాణం యజమానిని మాటల్లో పెట్టి రూ.1.50లక్షల విలువైన నాలుగు జతల చెవి దిద్దులు, కమ్మలు ఎత్తుకెళ్లారు. వెంటనే అనుమానం వచ్చిన దుకాణం యజమాని సీసీ కెమెరాలను పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. చోరీ చేసిన మహిళలను పోలీసులు పట్టుకుని విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్ఐ సత్యనారాయణను వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోదాడ రూరల్, ఏప్రిల్ 3: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల నుంచి ఇసుక టిప్పర్‌ను గణపవరం మీదుగా హుజూర్‌నగర్ వైపు వెళ్తుండగా, బుధవారం కోదాడ మండలం గణపవరం శివారులో పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. టిప్పర్ డ్రైవర్ ఎం.గోపయ్యస్వామి, టిప్పర్ యజమానిపై కూడా కేసు నమోదుచేశామన్నారు. పట్టుకున్న ఇసుక టిప్పర్‌ను రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

నూతన్‌కల్, ఏప్రిల్ 3: మండలంలోని మిర్యాల గ్రామంలో వీధి స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్న పెద్దింటి మల్లయ్యపై చర్యలు తీసుకోవా లని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. వీధి స్థలాన్ని మల్లయ్య ఆక్రమించి ఇంటిని నిర్మిస్తుం డగా, పనులు ఆపేయాలని నోటీసులు ఇచ్చినట్లు కార్యదర్శి తెలిపారు. నోటీసును బేఖాతరు చేస్తూ నిర్మాణం కొనసాగిస్తున్నందున మల్లయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి అనిల్ తెలిపారు.

ఉచిత కోచింగ్‌కు ఈ నెల 6న స్పాట్ అడ్మిషన్స్

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 3: డీఎస్సీ, గ్రూప్ 1, 2, 3, 4, బ్యాంకింగ్ సర్వీస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ వంటి ప్రభుత్వ ఉద్యోగాల ఉచిత కోచింగ్ కోసం ఈ నెల 6వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.లత, స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్ రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ సర్కిల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కుడకుడ ప్రాంతంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో జూన్ రెండో తేదీ వరకు ఉచిత కోచింగ్ ఇస్తారన్నారు. షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు డైట్, బీఈడీ ఉత్తీర్ణత సాధించి ఉండాల న్నారు. పూర్తి వివరాలకు సెల్ నెం. 989129935ను సంప్రదించాలన్నారు.

శ్మశానవాటిక ప్రహరీకి నిధులు కేటాయించాలి

నేరేడుచర్ల, ఏప్రిల్ 3: మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో దళిత శ్మశానవాటిక ప్రహరీకి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భార్గవ్ సైదులు కోరారు. ఈ మేరకు బుధ వారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దళితుల శ్మశానవాటికకు వందేళ్లుగా ప్రహరీలేదని, వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట నాయ కులు కందుల మురళి, వల్దాసు వేణు, కొత్తపల్లి ఏసు, సైదులు, జీవన్, రాజేష్, రాము, అఖిల్, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలు మల్లమ్మ మృతి

తిరుమలగిరి రూరల్, ఏప్రిల్ 3: మండలంలోని తాటిపాముల గ్రామా నికి చెందిన సీపీఎం నాయకురాలు కోల మల్లమ్మ(95) బుధవారం మృతి చెందింది. ఆమె మృతదేహంపై మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య ఎర్ర జెండా కప్పి మాట్లాడుతూ గ్రామంలో భూస్వాముల నిర్బంధం పెరిగిన సమయంలో మల్లమ్మ కార్యకర్తలను కాపాడారని కొనియాడారు. ఆమెను నేటి యువత స్ఫూరిగా తీసుకోవాలన్నారు. మల్లమ్మ మృతదేహానికి నివా ళులర్పించినవారిలో వివిధ పార్టీలకు చెందిన కాంతయ్య, కె.అంజయ్య, చంద్రనారాయణ, లలిత, యాదగిరి, కృష్ణ, సోమయ్య, ఎల్లయ్య, నర్సయ్య తదితరులు ఉన్నారు.

'ఉపాధి' టీఏ నాగార్జున చిత్రపటానికి నివాళి

మఠంపల్లి, ఏప్రిల్ 3: పనిఒత్తిడి కారణంగా గుండెపోటుతో మృతి చెందిన మహబుబ్‌నగర్ జిల్లా కొత్తగూడెం మండలానికి చెందిన ఉపా ధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్(టీఏ) నాగార్జున చిత్రపటానికి మఠంపల్లి 'ఉపాధి' సిబ్బంది ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ప్రభుత్వం 'ఉపాధి' సిబ్బందిపై పనిఒత్తిడి తగ్గించాలని, నాగా ర్జున కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మఠంపల్లి, ఏప్రిల్ 3: మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బొబ్బ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో, పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో బుధవారం చేరారు. ఈ సందర్భంగా మంజూనాయక్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నిజాం, వెంక టనారాయణ, పున్నయ్య, అచ్చయ్య, నాగరాజు, తులసీరాంనాయక్, నాయుడు ఆంజనేయులు, నాయుడు గురవయ్య, ప్రభు పాల్గొన్నారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం'

మఠంపల్లి, ఏప్రిల్ 3: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని గిరిజన మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి బానోతు బాలునాయక్ అన్నారు. బుధ వారం నల్గొండలో జరిగిన విజయ సంకల్ప సమ్మేళన సభకు మఠం పల్లి నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్య క్షుడు ఎల్లయ్యగౌడ్, కార్యదర్శి పుల్లయ్య, హుస్సేన్‌గౌడ్, నాగరాజు, మీసాల అంజి, గోపాల్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలుచేయాలి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 3: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలుచేయా లని మాల మహానాడు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది తల్లమల్ల హసేన్ కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన సమావే శంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలుచేస్తా మని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఇతర పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లపై గతంలో చేసిన తీర్మానానికి కట్టుబడి ఉండాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఇట్టిమళ్ల శ్రీనివాస్, ఇట్టిమళ్ల బెంజిమెన్, చప్పిడి భిక్షం, వీసం రాములు, దాది మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి'

హుజూర్‌నగర్, ఏప్రిల్ 3: సాగర్ ఆయకట్టులో ఎండిన పంటలకు ఎకరానికి రూ.30వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకుడు ముల్కలపల్లి సీతయ్య కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం తోనే రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో వెంకటే శ్వర్లు, శ్రీను, సాంబయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.